మోడల్ డివిజన్‌గా బంజారాహిల్స్

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : బంజారాహిల్స్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ డివిజన్‌లో ఎన్‌బీటీనగర్, మిథిలానగర్‌లో 3 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన పనులతోపాటు ప్రగతిలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

తెలంగాణ ఓపెన్ అండర్-15 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం



మధురానగర్ ఇండోర్‌స్టేడియంలో టోర్నమెంట్‌ను ప్రారంభించి బ్యాడ్మింటన్ ఆడుతున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

వెంగళరావునగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ సంక్షేమ సమితి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న తెలంగాణ ఓపెన్ అండర్-15 బాయిస్, గర్ల్స్ సింగిల్స్, డబుల్స్, మిక్సడ్ డబుల్స్ విభాగాల్లో బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025 పోటీలు కాలనీలోని డీసీహెచ్‌ఎస్‌ఎన్‌రాజు ఇండోర్‌స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయన్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఆటలకు కొంత సమయాన్ని కేటాయించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 142 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. మొదటి రోజు 75 మ్యాచ్‌లు జరిగాయి. బెస్ట్ ప్లేయర్‌కు మధురానగర్ కాలనీకి చెందిన ఎంఎల్‌ఆర్ మోటార్స్ వ్యవస్థాపకుడు ఎం.లోకేశ్వర్ రావు సుమారు లక్ష రూపాయల విలువ చేసే ఎలక్ట్రిక్ బైక్‌ను అందజేయనున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.వెంకటరావు, కోశాధికారి కె. వంశీప్రసాద్, సమితి అధ్యక్షుడు ఎం.ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎన్వీ మనోహర్ రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, కోశాధికారి సుగుణ, హనుమంతరావు యాదవ్, సీహెచ్ సత్యనారాయణ రాజు, శ్రీనివాస్, సుధాకర్, కాంగ్రెస్ నాయకుడు దేవిరెడ్డి నాగార్జున రెడ్డి, చిలకల వెంకటేశ్వరరావు, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

నాగలక్ష్మి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీ బీ-బ్లాక్ లోని నాగలక్ష్మి దేవి ఆలయంలో గురువారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సతీష్ కుమార్ శర్మ, స్థానిక నాయకులు దేవిరెడ్డి నాగార్జున రెడ్డి, సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహం అదుపులో ఉంచుకునేందుకు దేశీయ పద్ధతులే మేలు

● బ్రిటీష్ హై కమిషనర్ గారెత్‌వ్యాన్ ఒవెన్



చిరుధాన్యాల గురించి అడిగి తెలుసుకుంటున్న బ్రిటీష్ హై కమిషనర్ గారెత్‌వ్యాన్ ఒవెన్

బంజారాహిల్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మధుమేహం నియంత్రించుకునే దేశీయ పద్ధతులు అవలంబించడంతో పాటు సత్వర వైద్య సహాయం తీసుకోవడం మేలని బ్రిటీష్ హై కమిషనర్ గారెత్‌వ్యాన్ ఒవెన్ అన్నారు. మధుమేహం మాసం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12లో అపోలో షుగర్స్ క్లినిక్‌లో ఆరోగ్య ఆహారం, ఆరోగ్య జీవనం పేరిట జరిగిన ఆహార ఉత్పత్తుల ప్రదర్శనను ఆయన గురువారం తిలకించారు. మధుమేహం వ్యాధి బారిన పడిన వారు ఎలాంటి హారం తినాలి అనే దానిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుమేహం నియంత్రణలో ఉంచుకోవడం పెద్ద సమస్యేమి కాదని, జీవన శైలిని మార్చుకుంటూ ఉంటే వ్యాధులు ధరి చేరవని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయప్రకాశ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 29 చరిత్రలో నిలిచిపోయే రోజు

● తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నవంబర్ 29 చరిత్రలో నిలిచిపోయే రోజని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం జీహెచ్‌ఎంసీ స్థాయి బీఆర్‌ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అంటూ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష దేశ రాజకీయాల్లో పెను భూకంపం సృష్టించిందన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, హామీల అమలును మరిచి ప్రజలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి కేవలం 17 శాతమే కేటాయించి మోసం చేసిందన్నారు. తిరిగి అధికారంలోకి వచ్చేది తామేనని, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికి సముచిత గౌరవం కల్పిస్తామని తెలిపారు.

పేలిన వాషింగ్ మెషిన్.. తప్పిన ప్రమాదం

అమీర్‌పేట, నవంబరు, 27 (ఆంధ్రజ్యోతి): రన్నింగ్‌లో ఉన్న వాషింగ్ మిషన్ పెద్ద శబ్ధంతో ఒక్కసారిగా పేలిపోయింది. గురువారం మధ్యాహ్నం అమీర్‌పేటలోని ధరంకరం రోడ్డులోని ఓ ఇంట్లో జరిగింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీశారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని కేకే ఎన్‌క్లేవ్ ప్లాట్ నెంబర్ 53లో వి.సుందర్ రామశాస్త్రి కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. ఇంట్లోని బాల్కానీలో ఫ్రంట్ లోడ్ వాషింగ్ మిషన్‌లో ఉతకడానికి దుస్తులు వేశారు. రన్నింగ్లో ఉన్న వాషింగ్ మిషన్ మధ్యాహ్నం ఒక్కసారిగా పేలిపోయింది. వాషింగ్ మిషన్ పైభాగం ధ్వంసమై అందులోని విడిభాగాలన్నీ బాల్కానీలో చెల్లాచెదురుగా పడ్డాయి. ఆ సమయంలో పెద్ద శబ్ధం రావడంతో ఇంట్లో హాల్లో కూర్చుని ఉన్న కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీశారు. ప్రమాద విషయాన్ని వాషింగ్ మిషన్ కస్టమర్ కేర్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ వారు స్పందించ లేదని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో సుందర్ రామశాస్త్రి ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆక్రమణలపై హైడ్రా విచారణ

● సక్కుబాయి లేఔట్‌పై సంబంధిత పత్రాలు సమర్పించాలన్న కమిషనర్



హైడ్రా కార్యాలయంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్, పక్కన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, సొసైటీ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్‌పేట విలేజ్‌లోని సక్కుబాయి లే ఔట్‌లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల ఆక్రమణలపై హైడ్రా విచారణ చేపట్టింది. సర్వే నంబరు 327లో 25 ఎకరాల పరిధిలో సక్కుబాయి నగర్ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ పేరుతో లేఔట్ వేశారు. కాగా, ఇక్కడి పార్కును కాపాడాలంటూ హైడ్రా ప్రజావాణిలో గతంలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో విచారించిన అధికారులకు మరిన్ని ఆక్రమణల గురించి తెలిసింది. పార్కుతోపాటు.. శ్మశానవాటిక, చారిత్రక బుల్కాపూర్ నాలా ఆక్రమణలకు గురైనట్లు వారు గుర్తించారు. దీంతో సర్వే నంబరు 327లో మిగిలి ఉన్న భూమికి సంబంధించిన అంశాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ భావించారు. ఈ మేరకు ఇక్కడి ఖాళీ స్థలాలపై సొసైటీకి చెందిన వారితో పాటు షేక్‌పేట విలేజ్ ప్రతి నిధులతో హైడ్రా కార్యాలయంలో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు విన్నారు. అలాగే సంబంధిత పత్రాలను పరిశీలించారు. కాగా, సక్కుబాయి లేఔట్ వేసిన భూమి ప్రభుత్వానిదేనని షేక్‌పేట విలేజ్ ప్రతినిధులు సదానందం, అశోక్ కుమార్ ఆరోపించారు. పార్కు స్థలంగా పేర్కొంటున్న ప్రాంతాన్ని తాము ఆలయ ఉత్సవాలకు వాడుకుంటున్నామని కమిషనర్‌కు వారు వివరించారు. శ్మశానాన్ని కూడా వదలకుండా సొసైటీ ప్రతినిధులు కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అయితే సొసైటీ సెక్రటరీ సీతారామయ్య ప్రతినిధులు కూడా ఆ భూమి తమకు ఎలా వచ్చిందో కమిషనర్‌కు తెలిపారు. అధికారిక లేఔట్‌లోని పార్కును కాపాడాలని కోరారు. క్షేత్రస్థాయిలో మరింత లోతైన విచారణ చేపట్టాలని కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. సంబంధిత పత్రాలన్నీ పరిశీలించడంతోపాటు క్షేత్ర స్థాయిలో వివిధ శాఖల నుంచి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఇరుపక్షాలకు చెందిన వారు కూడా పూర్తి వివరాలు అందజేయాలని.. తర్వాత అన్ని శాఖల అధికారుల సమక్షంలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అక్కడ ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల్లో నిర్మాణాలు ముందు రాకుండా చూడాలని సూచించారు. సమావేశంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకురాలు మాగంటి సునీత, స్థానిక నిర్వాసితులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్‌ను ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గురువారం కలిసి సన్మానించారు. సేవాదళ్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ అలీ జమీల్, ఎండీ రహీం, షేక్ ఇబ్రహీం, రహ్మత్‌నగర్ డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సజ్జాద్, ఇనాయత్ పాల్గొన్నారు. -(బోరబండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి)



మాజీ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డిని బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్. వారి వెంట కాంగ్రెస్ నాయకులు నారికెళ్ల నరేష్, కాటూరి రమేష్ తదితరులు ఉన్నారు. -(బంజారాహిల్స్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి)

యూపీ విద్యుత్ ఉద్యోగులకు మద్దతుగా నిరసన



విద్యుత్ సంస్థ కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పవర్ ఇంజనీర్స్ జేఏసీ ప్రతినిధులు

ఖైరతాబాద్, నవంబరు27(ఆంధ్రజ్యోతి) : ఉత్తర ప్రదేశ్‌లో విద్యుత్ ఉద్యోగులు సంవత్సరం నుంచి ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా అక్కడి విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేసే దిశగా వెళ్తుండడం శోచనీయమని తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ పిలుపు మేరకు గురువారం మింట్ కాంపౌండ్‌లోని విద్యుత్ సంస్థల కార్పొరేట్ కార్యాలయం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీపీఈజేఏసీ చైర్మన్ సాయి బాబా మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఎలక్ట్రిసిటీ ఎమెండ్‌మెంట్ బిల్లు 2025ను పార్లమెంట్‌లో ఆమోదిస్తే దేశ వ్యాప్త సమ్మెకు వెనకాడమని అన్నారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటు పరం చేస్తే రైతులు, ఉద్యోగులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో రామగుండం, పాల్వంచ విద్యుత్ కేంద్రాలను తక్కువ రేటుకు జెన్కో ద్వారా నిర్మింపజేయాలని కోరారు. జేఏసీ కన్వీనర్ రత్నాకర్ రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో విద్యుత్ సంస్థలు ఉంటేనే ప్రజలకు మేలు కలుగుతుందని, ఉత్తర ప్రదేశ్‌లో సంస్థలను ప్రైవేటీకరణ చేయనివ్వమని స్పష్టం చేశారు. నిరసనలో జేఏసీ ప్రతినిధులు కరుణాకర్‌రెడ్డి, గోవర్ధన్, సెహ్రా, సదానందం తదితరులు పాల్గొన్నారు.

గాయని మంగ్లీపై అసభ్య వ్యాఖ్యలు చేస్తూ పోస్టు

అమీర్‌పేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గాయని మంగ్లీపై ఇన్‌స్టాలో అసభ్య వ్యాఖ్యలను పోస్టు చేసిన మేడిపల్లికి చెందిన మల్లికార్జునగౌడ్ మాద అనే వ్యక్తిని ఎస్‌ఆర్‌నగర్ పోలీసుల అరెస్టు చేశారు. ఇటీవల వైరల్ అయిన మంగ్లీ పాడిన 'బాయిలోన బల్లి పలికే పాట విషయమై తన అభిమాని అడిగిన ప్రశ్నకు మల్లికార్జునగౌడ్ మాద బదులిచ్చాడు. మంగ్లీ పట్ల అసభ్య రీతిలో వ్యాఖ్యానిస్తూ తన ఇన్‌స్టా ఖాతా 'మేడిపల్లి స్టార్ లో పోస్టు చేశాడు. ఇది వైరల్‌గా మారడంతో సింగర్ మంగ్లీ నగర పోలీసు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కాగా అమీర్‌పేటకు చెందిన మంగ్లీ అభిమాని గోవింద్ కూడా ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. ఈ మేరకు మల్లికార్జున గౌడ్‌ను ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిపై వివిధ సెక్షన్లతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆధ్యాత్మికం ముసుగులో మహిళకు పాస్టర్ వల

● పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

బేగంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చర్చికు వచ్చిన ఓ మహిళను నమ్మించి, పెళ్లి చేసుకుంటానని ఆమెతో శారీరక అవసరాలు తీర్చుకుని చివరకు ముఖం చాటేయడంతో బాధితురాలు పాస్టర్‌పై సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎర్రగడ్డ ప్రాంతానికి చెందిన వివా హిత మహిళకు తన దాంపత్య జీవితంలో ఇబ్బందులు వచ్చాయని, దీంతో ఉప్పల్ వద్ద ఉన్న లివింగ్ వే చర్చి పాస్టర్ వద్దకు వెళ్లాలని, అక్కడ ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని చెల్లెలు సలహా ఇచ్చింది. దీంతో చర్చి పాస్టర్ జోసెఫ్ సందీప్‌ను తరచూ కలవడంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నది. ఈక్రమంలో సదరు మహిళ తన భర్తతో విడాకులు తీసుకుంది. ఆ తర్వాత పాస్టర్ జోసెఫ్ సందీప్ తన భార్యకు విడాకులు ఇచ్చి పెళ్లి చేసుకుంటానని చెప్పారు. విడాకుల సెటిల్‌మెంట్ కోసం సదరు మహిళ వద్ద నుంచి రూ.12 లక్షలు, ఆమె ఇద్దరు స్నేహితురాళ్లలో ఒకరి నుంచి రూ.2 లక్షలు, మరొకరి నుంచి రూ.లక్ష తీసుకున్నాడు. అప్పటినుంచి మహిళను వివాహం చేసుకుంటానని చెబుతూ తరచూ ఆమె ఇంటికి రావడంతో ఆమెతో శారీరక సంబంధం కొనసాగిస్తున్నాడు. వివాహం చేసుకోవాలని ఆమె ఒత్తిడి చేయడంతో 2024 సెప్టెంబరులో ఒకసారి, 2025 ఏప్రిల్‌లో మరోసారి నిర్ణయించి వాయిదా వేశాడు. చివరికి మోసపోయానని గ్రహించిన మహిళ న్యాయం కోసం సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

హైటెక్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఎండీఎంఏ డ్రగ్ కలిగి ఉన్న ఇద్దరు యువకులను ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేసి మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. మాదాపూర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ వివరాల ప్రకారం హయత్‌నగర్‌కు చెందిన భరత్ రెడ్డి (23), వనస్థలిపురానికి చెందిన రాకేష్ (22) ఇద్దరు యువకులు బెంగళూరు, గోవా నుంచి ఎండీఎంఏ డ్రగ్ నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. బుధవారం రాత్రి మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో విక్రయిండానికి ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.2 లక్షల విలువైన 14 గ్రాముల ఎండీఎంఏ మాదకద్రవ్యంతో పాటు 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల కస్టడీలో మోనాలిసా

బోరబండ, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్ల లీడర్ మోనాలిసాను బోరబండ పోలీసులు గురువారం కస్టడీలోకి తీసుకున్నారు. న్యాయస్థానం అనుమతి మేరకు మూడు రోజులపాటు పోలీసులు ఆమెను విచారించ నున్నారు. ట్రాన్స్‌జెండర్ల లీడర్ మోనాలిసా, ఆమె అనుచరులతో తమకు ప్రాణహాని ఉందని, వారి బారినుంచి కాపాడాలని కోర ుతూ పలువురు హిజ్రాలు బోరబండ బస్టాపు వద్ద 17న ఆందోళన చేయడం, ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోవడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వారిలో ముగ్గురు మరణించారు. ఈ కేసులో బోర బండ పోలీసులు మోనాలిసాను బెల్లంపల్లిలో అరెస్టుచేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించిన విష యం తెలిసిందే. చంచల్‌గూడ జైలులో ఉన్న మోనాలిసాను విచారణ నిమిత్తం తమ కస్టడీలోకి ఇవ్వాలని బోరబండ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం మూడు రోజుల పాటు మోనాలిసాను పోలీసుల కస్టడీకి అనుమతించింది. భద్రతా కారణాల దృష్ట్యా మోనాలిసాను బోరబండ ఠాణాలో కాకుండా వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో విచారించనున్నట్లు సమాచారం. కాగా, సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మోనాలిసా, అనుచరుల బారినుంచి కాపాడాలని ట్రాన్స్‌జెండర్లు పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు





మాసబ్‌ట్యాంక్‌లోని ఇన్‌కమ్‌ట్యాక్స్ టవర్స్‌లో గురువారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ఫొటోలు : స్టాఫ్‌ఫొటో గ్రాఫర్, ఆంధ్రజ్యోతి

ఎర్రగడ్డ చెస్ట్ ఆసుపత్రి మరింత అభివృద్ధికి చర్యలు

ఎర్రగడ్డ, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించడానికి ఎర్రగడ్డ చెస్ట్ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, విద్య సంచాలకులు డాక్టర్ ఎ.నరేంద్ర కుమార్ తెలిపారు. ఎర్రగడ్డలోని చెస్ట్ ఆసుపత్రిని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొన్ని అనివార్య కారణాల వల్ల పడకల సంఖ్య తగ్గిందని, కొన్ని విభాగాలు కూడా మూతపడడంతో రోగులకు మెరుగైన సేవలు అందడం లేదని అన్నారు. వాటన్నిటినీ పునరుద్ధరిస్తామని తెలిపారు. ఆసుపత్రి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఆసుపత్రికి నూతన భవనం నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి అధికారులు డీఎంఈ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్ కుమార్, మాజీ సూపరింటెండెంట్, సనత్‌నగర్ టీమ్స్ నోడల్ అధికారి డాక్టర్ మహబూబ్ ఖాన్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగడ్డ చెస్ట్ హాస్పిటల్‌ను సందర్శించిన రాష్ట్ర వైద్య, విద్య సంచాలకులు నరేంద్ర కుమార్

అసలు నగలు దాచి నకిలీవి పెట్టి..

● నగల దుకాణంలో చెవి పోగులు చోరీ

బంజారాహిల్స్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగలు కొనేందుకు వచ్చినట్టు నటిస్తూ బంగారు చెవి పోగులు చోరీ చేసి వాటి స్థానంలో పాత వాటిని పెట్టిన ముగ్గురు మహిళలపై పోలీసులు కేసు నమోదు చేశారు. షేక్‌పేట్ ఓయూ కాలనీలో ఉన్న సుజాని జ్యువెలరీకి ఈ నెల 26న ముగ్గురు తెలియని మహిళలు వచ్చారు. నగలు చూపించాలని కోరారు. సేల్స్‌మెన్ చెవిపోగులు చూపించాడు. 10 గ్రాముల విలువైన అసలు బంగారు చెవిపోగులను తీసి వాటి స్థానంలో నకిలీ చెవి పోగులను పెట్టి మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేటికి నకిలీ చెవి పోగులు కనిపించడంతో జరిగిన మోసం తెలిసింది. దుకాణ యజమాని సుధీర్ ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు.

డైమండ్ నెక్లెస్ మాయం

బంజారాహిల్స్ , నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : అల్మారాలో పెట్టిన విలువైన డైమండ్ నెక్లెస్ మాయమైంది. నగరానికి చెందిన సాకేత్ రామారావు కుటుంబంతో బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2లోని ఆర్బీఐ ప్రణవ్ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ నెంబర్ 202లో నివసిస్తున్నారు. ఈ నెల 26న ఆయన భార్య ఇల్లు సర్దుతుండగా కబోర్డ్‌లో ఉండాల్సిన డైమండ్ నెక్లెస్ కనిపించకుండా పోయింది. అన్నిచోట్ల వెతికినా కనిపించలేదు. దీంతో బాధితులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చివరిసారిగా నెక్లెస్‌ను సెప్టెంబరు 26న చూసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంట్లో పని చేసే శారద సునీత, అలివేలుపై అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెఫ్‌పై పైపుతో దాడి

బంజారాహిల్స్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న చెఫ్‌పై దుండగులు దాడి చేశారు. ఒడిశాకు చెందిన చోటుకుమార్ అంతేరలో చెఫ్‌గా పనిచేస్తూ వెంకటగిరిలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 26న డ్యూటీ ముగించుకొని తన స్నేహితులతో కలిసి వెంకటగిరి వైపు వెళ్తుండగా, జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10 వద్ద స్యాలా కిచెన్ దగ్గర ఓ గుంపు అకస్మాత్తుగా వారిపై దాడి చేసింది. దాడిచేసిన వారిలో ఒకడు ఐరన్ పైప్‌తో చోటును తలపై బలంగా కొట్టాడు. గాయపడ్డ చోటును హాస్పిటల్‌కు తరలించిన స్నేహితులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంపెనీ నిధులు సొంత ఖాతాకు మళ్లింపు

● అకౌంట్స్ ఏజీఎంపై కేసు

బంజారాహిల్స్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పనిచేస్తున్న కంపెనీకి చెందిన రూ.2.06 కోట్లను సొంత బ్యాంకు ఖాతాలోకి మళ్లించుకున్న కంపెనీ ఏజీఎంపై కేసు నమోదైంది. బంజారాహిల్స్‌లోని ఎస్ఐఎస్‌పీఎల్ కంపెనీలో ఎంకేవీ ప్రసాద్‌రావు ఏజీఎంగా పనిచేస్తున్నాడు. జనవరి నుంచి జూలై 2025 మధ్య కాలంలో వేతన బిల్లులు, వెండర్ బిల్లులు, పర్చేస్ డాక్యుమెంట్లను నకిలీగా రూపొందించి కంపెనీకి చెందిన బ్యాంక్ ఖాతా నుంచి రూ.2.06 కోట్లను తన బినామీ బ్యాంక్ ఖాతాలకు మళ్లించాడు. ఆడిట్‌లో ఈ అక్రమాలు బయటపడడంతో కంపెనీలో హెచ్‌ఆర్ మేనేజర్ రాచూరు రాజేష్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వయోధికులకు విహారయాత్ర



హైదరాబాద్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సాథీ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిధిలోని ఓం ఫర్ ది డిజేబుల్ ఏజ్డ్, లిటిల్ సిస్టర్స్ ఓల్డ్ ఏజ్ హోమ్‌కు చెందిన 40 మంది వయోధికులకు గురువారం విహారయాత్ర నిర్వహించారు. కలెక్టర్ హరిచందన దాసరి ప్రత్యేక చొరవతో వారిని గండిమైసమ్మ టెర్మినల్ వన్ విమాన హోటల్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చిన్న చిన్న ఆటలు, పాటలు వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, కుటుంబసభ్యుల ఆదరణ కోల్పోయిన వృద్ధులకు మానసికోల్లాసాన్ని కల్పించడంతోపాటు సామాజిక పరిచయాలు పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని సంకల్ప స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రోజి తెలిపారు.

అత్తింటి వేధింపులకు మహిళ ఆత్మహత్య

బంజారాహిల్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అత్తింటి వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్యకు చేసుకుంది. నగరానికి చెందిన కధిరెపల్లి రమేష్ తన కుమార్తె గౌతమి (37)ని షేక్‌పేట్‌కు చెందిన ఓ వ్యక్తితో వివాహం చేశారు. కాగా ఈ నెల 26న గౌతమి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త, అత్తమామల వేధింపులు తట్టుకోలేక తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని రమేష్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాలిస్తామని మోసం చేసిన సంస్థ అకౌంట్స్ సీజ్

హైటెక్‌సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఐటీ సంస్థలో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించి వందలాది మంది నుంచి కోట్లాది రూపాయిలు వసూలు చేసి పరారైన సంస్థ నిర్వాహకుల ఆచూకీ కోసం మాదాపూర్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇటీవల మాదాపూర్ ఐటీ కారిడార్‌లో పలు సంస్థలు ఉద్యోగాలు ఇస్తామంటూ యువకుల నుంచి డబ్బులు వసూలు చేసి పరారైన సంఘటనలు అనేకం ఉన్నాయి. దానిలో భాగంగా మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ ఈ ఘటనపై ప్రత్యేక బృందాలను నియమించి నిందితుల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. ఎన్‌ఎస్‌ఎన్ ఇన్‌ఫోటెక్ ఐటీ సంస్థలో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇస్తామంటూ నమ్మించి వందలాది మంది నుంచి డబ్బు వసూలు చేసి సంస్థ యాజమాన్యం చేతులు ఎత్తేసింది. దాంతో బాధితులంతా తమకు న్యాయం చేయాలంటూ బుధవారం మాదాపూర్ పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం సంస్థ బ్యాంకు అకౌంట్లను సీజ్ చేశారు. గతంలో వీరిపై ఎటువంటి నేరారోపణలు ఉన్నాయి, మొత్తం ఎన్ని బ్రాంచ్‌లు ఉన్నాయి, ఎంత మంది నుంచి ఉద్యోగాల పేరుతో డబ్బు వసూలు చేశారు, వారికి కన్సల్టెన్సీలు ఏరకంగా సహాయ పడ్డాయి అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో కేసుకు సంబంధించిన వివరాలు వెలుగులోకి రానున్నాయి.




వారాసిగూడ బస్టాప్‌లో బస్సుల కోసం నిల్చున్న ప్రయాణికులు

ప్రయాణికులకు అనుగుణంగా

ఆర్టీసీ బస్సులు ఏవి?

- పెరగని బస్సుల సంఖ్య
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

బౌద్ధనగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు అనుగుణంగా రద్దీ రూట్లలో ఆర్టీసీ బస్సులు తిరగకపోవటంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు అంతంత మాత్రమే ఉండటం... అవి పాత బస్సులు కావడంతో ఎక్కడ మొరాయిస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. రోజు రోజుకు ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండటం, సమయానికి బస్సులు రాకపోవడంతో గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రద్దీ రూట్లలో బస్సుల సంఖ్యను పెంచాల్సిన అధికారులు తమ బాధ్యతను విస్మరిస్తున్నారు. బస్సుల సంఖ్య పెంచాలని నుంచి ఫిర్యాదులు అందినా పట్టించుకోవటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సమయానికి బస్సులు రాకపోవటంతో మహిళలు, వృద్ధులు, కాలేజీ స్టూడెంట్స్ ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రయాణికులు తమ ప్రాంతానికి వచ్చే బస్సులను అదనపు ట్రిప్‌లు పెంచాలని అధికారులను కోరుతున్నారు. గతంలో అడిక్‌మెట్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టక ముందు ప్రతి ఐదు నిమిషాలకు వివిధ ప్రాంతాలకు బస్సులు రాకపోకలు సాగించేవి. ఫ్లైఓవర్ పూర్తి అయిన తర్వాత వివిధ ప్రాంతాలకు బస్సు సర్వీసులను రద్దు చేశారు. ప్రసుత్తం కొన్ని రూట్లలో మాత్రమే బస్సులు నడుస్తున్నాయి.

ఇప్పుడు ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రయాణికుల అవసరాలకు తగినవిధంగా బస్సులు లేకపోవటంతో వివిధ పనుల మీద వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదిలా ఉంటే ఒకేసారి లైన్‌గా మూడు, నాలుగు బస్సులు వస్తుండటం, తర్వాత బస్సులు రాకపోవడంతో ఉదయం పూట సమయానికి పాఠశాలలకు, కాలేజీలకు చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సులను నడుపుతున్నామని ఆర్టీసీ అధికారులు నామమాత్ర ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆయా ప్రాంతాల్లో బస్సులు సవ్యంగా రాకపోకలు సాగిస్తున్నాయో లేదో అధికారులు తనిఖీలు చేపట్టాలని కోరుతున్నారు.

మినీ బస్సులు నడపాలి

బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లలోని పలు కాలనీలకు ఆర్టీసీ మినీ బస్సులను నడపాలని పలువురు మహిళలు కోరుతున్నారు. ఈ ప్రాంతాల నుంచి సుమారు రెండు కిలోమీటర్లు నడిచి వచ్చి బస్సులు ఎక్కాల్సివస్తుందని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. సికింద్రాబాద్, పార్శీగుట్ట, మహ్మద్‌గూడ, వారాసిగూడల మీదుగా సికింద్రాబాద్‌కు మినీ బస్సులు నడిపితే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా ఈ ప్రాంతాల్లో అధికారులు సర్వే చేసి బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సమయపాలన పాటించాలి



కాలనీలకు మినీ ఆర్టీసీ బస్సులు నడిపితే ఉపయోగకరంగా ఉంటుంది. ఉచిత ఆర్టీసీ బస్సులున్నా ప్రయోజనం లేదు. బస్సులు తగిన సమయానికి రాకపోవటంతో కాలేజీలకు, ఆఫీసులకు ఆలస్యంగా వెళ్లవలసి వస్తుంది. అధికారులు ఎప్పటికప్పుడు ప్రయాణీకుల నుంచి సమస్యలను కూడా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలి.

- శశిరేఖ, మెట్టుగూడ

బస్సులను పెంచాలి



ప్రయాణికుల రద్దీని గమనించి రద్దీ రూట్లలో ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి. ఉదయం, సాయంత్రం సమయాల్లో కాలేజీలు, ఉద్యోగాలు, వివిధ పనులు నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లే వారికి బస్సులు సమయానికి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితంశూన్యం.

- నందారం సీతారాం, జీదలబస్తీ



కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు, కాలనీల పెద్దలు

నివాస ప్రాంతాల్లో వైన్స్‌షాపు ఏర్పాటు చేయవద్దు

మారేడుపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి 6వ వార్డు ప్రాంతంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, సికింద్రాబాద్ రెతిఫైల్ బస్టాండ్ ఏరియాల్లో విద్యాలయాలు, దేవాలయాలు, నివాస ప్రాంతాల మధ్యలో వైన్స్‌షాపు, సిట్టింగ్ రూంలు పెడుతుండటంతో అందరికీ ఇబ్బందులు ఎదురుకానున్న దృష్ట్యా ఆయా ప్రాంతాల మహిళలు, కాలనీల పెద్దలు గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అక్కడ వైన్స్‌షాపు ఏర్పాటును నిలిపివేయాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత ఎక్సైజ్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. దీంతో అధికారులు తగిన చర్యలు తీసుకుని వైన్స్ ఏర్పాటు జరగకుండా చూస్తామని చెప్పారని తెలిపారు.

బస్తీల అభివృద్ధికి కృషి : శ్రీగణేశ్

బోయినపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బస్తీల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పేర్కొన్నారు. ఆయన గురువారం కంటోన్మెంట్ వార్డు పరిధిలోని శివాలయం వీధి, పెన్షన్ లైన్ బస్తీల్లో ఎలక్ట్రిసిటీ, శానిటేషన్, ఇంజనీరింగ్ తదితర కంటోన్మెంట్, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులను వెంట బెట్టుకుని క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నిరంతరం ప్రజల్లో ఉండి సమస్యలను నేరుగా తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే బస్తీ పర్యటనలను చేపడుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, వార్డ్ అధ్యక్షుడు మారుతి గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పిడి మధుకర్, బల్వంత్ రెడ్డి, సదానంద్, రాజు, గోమతి, వరదారాని, వరప్రసాద్, ముకేష్ యాదవ్, వందన, హరికృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ పత్రం అందజేత

నల్లగుట్ట ముస్లీంబస్తీకి చెందిన నజీర్ అహ్మద్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రెండులక్షల రూపాయల ఆర్థిక సహాయం మంజూరు పత్రాన్ని(ఎల్‌ఓసీ) సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం అందజేశారు. నాయకులు రాంగోపాల్ పేట డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, కోటేశ్వర్ గౌడ్, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

- మారేడుపల్లి, ఆంధ్రజ్యోతి



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు

అంబేద్కర్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి : భరత్

అడ్డగుట్ట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆదం భరత్ కుమార్ సూచించారు. గురువారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా లాలాగూడ రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సందీప్ కాంబ్లే, ప్రీతమ్ కాంబ్లేలతో పాటు పలువురు యువ నాయకులు పాల్గొన్నారు.

సీఎం హామీ నిలబెట్టుకోవాలి : ఏబీవీపీ



మాట్లాడుతున్న ఏబీవీపీ ఓయూ అధ్యక్షుడు ధృహన్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఏబీవీపీ ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు ధృహన్, శివశంకర్ కోరారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓయూను ఇతర విశ్వవిద్యాలయాలతో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లాలన్నారు. పరిశోధన అభివృద్ధికి ఫ్యాకల్టీ నియామకాలు, అధునాతన ల్యాబ్ పరికరాలు, ఓయూ-హాబ్ ఏర్పాటు అవసరమని సూచించారు. ముఖ్యమంత్రి హామీ నిలబెట్టుకోకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.



ఓయూ వీసీని కలిసిన బీదర్ యూనివర్సిటీ బృందం

ఓయూను సందర్శించిన బీదర్ యూనివర్సిటీ బృందం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో అమలవుతున్న ఆన్‌లైన్ ఇవాల్యుయేషన్ వ్యవస్థ పనితీరును అధ్యయనం చేయడానికి కర్ణాటకలోని బీదర్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం గురువారం ఓయూను సందర్శించింది. డిజిటల్ మూల్యాంకన విధానం వేగం, కచ్చితత్వం, భద్రత వంటి ప్రత్యేకతలను ఓయూ వీసీ కుమార్ మొలుగరం వారికి వివరించారు. బీదర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ బిరాదర్ ఆధునిక, తప్పులేని ఇవాల్యుయేషన్ వ్యవస్థను తమ విశ్వవిద్యాలయంలో అమలు చేసేందుకు ఓయూ సహకారాన్ని కోరారు.

హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్ నుంచి

కాకతీయనగర్ కాలనీని తప్పించాలి

మల్కాజిగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ నుంచి వినాయక్‌నగర్ డివిజన్ కాకతీయనగర్ ఈస్ట్ అండ్ సౌత్ కాలనీని తప్పించాలని ప్రజలు కోరుతున్నారు. గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌లో డాక్టర్ ఏఎస్‌రావునగర్ నుంచి నేరేడ్‌మెట్ వరకు ప్రతిపాదించిన 100 అడుగుల రోడ్డుతో తమ కాలనీకి చెందిన దాదాపు 450 కుటుంబాలకు నష్టం జరుగుతుందన్నారు. సమస్యను అసెంబ్లీలో లేవనెత్తుతానని, దీనిపై హెచ్‌ఎండీఏ అధికారులకు లేఖ రాస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బద్దం పరుశరాంరెడ్డి, కాలనీవాసులు దశరథ్ శ్రీహరి, గుత్తిరాంచందర్, మోహన్, సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడిగా అవకాశం ఇవ్వండి



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిరణ్ కుమార్ ముదిరాజ్

సికింద్రాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడిగా తనకు అవకాశం కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిరణ్‌కుమార్ ముదిరాజ్ బీజేపీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద పదవీ కాలం వచ్చే ఫిబ్రవరిలో ముగియనుంది. ఆమె పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించకుండా ఆమె స్థానంలో కొత్తవారిని నియమించాలని భావిస్తే అవకాశం ఇవ్వాలని గురువారం డైమండ్ పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తాను తొలి నుంచీ బీజేపీలో ఉన్నానని, ప్రాణం పోయే వరకు బీజేపీలోనే కొనసాగుతానని చెప్పారు. తాను నివసిస్తున్న 8వ వార్డు ఎస్సీ రిజర్వ్‌డ్ వార్డుగా ఉందని, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం కూడా ఎస్సీ రిజర్వ్‌డ్ సెగ్మెంట్‌గా ఉందని, ఈ పరిస్థితుల్లో తనకు అటు బోర్డు ఎన్నికల్లోగాని, ఇటు అసెంబ్లీ ఎన్నికల్లో గాని పోటీ చేసే అవకాశం తనకు లేదన్నారు. అందుకే తనకు బోర్డు నామినేటెడ్ సభ్యునిగా అవకాశం కల్పించాలని విన్నవించుకుంటున్నట్లు తెలిపారు. తనకు నామినేటెడ్ సభ్యునిగా ఛాన్స్ ఇవ్వాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌లకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఓయూలో ఏఐ ఆధారిత ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ల్యాబ్



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఓయూ వీసీ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ల్యాబ్'ను వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్ ఇంజనీరింగ్‌తో కృత్రిమ మేధస్సు పునరేకీకరణ అత్యవసరమని, భవిష్యత్ పరిశ్రమ అవసరాలకు ఇది కీలకమని తెలిపారు. హెచ్‌బీఐసీ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు కమలాకర్ పల్లెళ్ళ భాగస్వామ్యంతో ఈ ల్యాబ్ రూపుదిద్దుకుంది. పవర్ సిస్టమ్స్, స్మార్ట్ గ్రిడ్స్, ఆటోమేషన్‌లో ఏఐ వినియోగం పెరగనున్నదని ఆయన పేర్కొన్నారు.

బయోమెడికల్ విభాగానికి కొత్త కమిటీ రూమ్

ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన కొత్త కమిటీ రూమ్‌ను వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ప్రారంభించారు. కమిటీ రూమ్ ద్వారా అకడమిక్ ప్లానింగ్, రీసెర్చ్ చర్చలు, కరికులం అభివృద్ధి, విద్యార్థుల సంబంధిత నిర్ణయాలు మరింత సమర్థవంతంగా జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.మంగు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ సతీష్ కుమార్ పెద్దపల్లి, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఓయూలో జాతీయ వర్క్‌షాప్



రిజిస్ట్రార్ నరేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో "డ్రైవింగ్ జెన్ జెడ్ టువార్డ్స్ లైఫ్ గోల్స్" పేరిట రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేశ్‌రెడ్డి వర్క్‌షాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. యువతలో జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు, భవిష్యత్ సామర్థ్యాలు రూపుదిద్దడంలో విశ్వవిద్యాలయాల పాత్ర కీలకమని అన్నారు. డిజిటల్ యుగంలో జెన్ జడ్ తరగతులను కొత్త రీతిలో రూపొందిస్తున్నారని, గేమిఫికేషన్, బ్లెండెడ్ లెర్నింగ్, మెంటర్‌షిప్ వంటి పద్ధతులు అవసరమని మెనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ శ్రీరాములు సూచించారు. ప్రొఫెసర్ ఇంద్రకాంతి శేఖర్ యాక్టివిటీ-బేస్డ్ లెర్నింగ్ ప్రాముఖ్యతను వివరించారు. నూతన తరం విద్యార్థుల అంచనాలకు తగ్గట్టుగా విద్యా సంస్థలు మారాల్సిన అవసరం ఉందని కన్వీనర్ డా. సమున్నత చెప్పారు. రెండు రోజులపాటు నిపుణుల ప్రసంగాలు, ఇంటరాక్టివ్ సెషన్లు, కేస్ స్టడీలు, బోధనా పద్ధతుల ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు విభాగాధిపతి ప్రొఫెసర్ జహంగీర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకటయ్య, స్మితా సాంబ్రాని, చెన్నప్ప, ప్యాట్రిక్, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే

ముషీరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ లోని వినోభానగర్‌లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి ఈ కొత్తపైపులైన్‌ను వేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని వినోభానగర్‌లో రూ. 6.50లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం పనులను ఎమ్మె ల్యే ముఠా గోపాల్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ దశాబ్ద కాలంగా వినోభానగర్‌లో డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామన్నారు. వారం రోజులలో పనులు పూర్తి చేసి డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేటర్లకు రూ.2 కోట్ల నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. నగర ఇన్‌చార్జి మంత్రి మరో కోటి రూపాయలు కేటాయించడం వల్ల డివిజన్‌లో సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నా రు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కార్పొరేటర్లను పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయిం ట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, ముషీరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ పెన్షనర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు

పెన్షనర్ల 'ఆరోగ్య' బాధ్యత ప్రభుత్వానిదే : శ్రీధర్

రాంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లందరికీ ప్రభుత్వమే ఆరోగ్య సంరక్షణ బాధ్యతను నిర్వహించాలని నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ పెన్షనర్స్ అసోసియేషన్స్ (ఎన్‌సీసీపీఏ) అధ్యక్షుడు శ్రీధర్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ వేతన సవరణ కమిషన్‌కు సూచించిన నిబంధనల నుంచి అభ్యంతరకరమైన, తప్పుదారి పట్టించే పదజాలాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరెడ్డి, పాలకుర్తి కృష్ణమూర్తి, ఎం.ఎన్.రెడ్డి, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల రద్దుతో తీరని అన్యాయం: సీఐటీయూ

రాంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని సీఐటీయూ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి జె.కుమారస్వామి ఆరోపించారు. గురువారం గోల్కొండ చౌరస్తాలోని కార్యాలయంలో సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందని ఆరోపించారు. ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర మహాసభలు మెదక్ పట్టణంలో డిసెంబర్ 7, 8, 9వ తేదీలలో నిర్వహిస్తున్నామని, కార్మికవర్గం జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.వెంకటేష్, ఎం.దశరథ్, జి.రాములు, జి.నరేష్, టి.యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పద్మారావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ పాఠశాల శాశ్వత భవన సాధన సమితి బృందం

పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించండి

అడ్డగుట్ట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నియోజకవర్గం లాలాపేట్‌లోని విజయ డెయిరీ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు శాశ్వత స్థలం కేటాయించి, భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ గురువారం విజయ డెయిరీ ప్రభుత్వ పాఠశాల భవన సాధన సమితి బృందం సీఆర్‌పిఎఫ్ మండల కన్వీనర్ ప్రవీణ్, తెలంగాణ తల్లుల సంఘం జిల్లా కో-కన్వీనర్ శోభ, ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్ అరవెల్లి సువర్ణ, మైత్రి, గీతలు సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావును కలిసి వినతి పత్రం సమర్పించారు ప్రభుత్వ బడికి స్థలం కేటాయించి శాశ్వత బడి నిర్మించాలని వినతిపత్రంలో కోరారు. ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వ పాఠశాలకు కోసం శాశ్వత బడి నిర్మాణం చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నేడు తాడ్‌బండ్ ఆలయంలో హుండీ లెక్కింపు



బోయినపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ తాడ్‌బండ్ అంజనేయ స్వామి ఆలయంలో నేడు హుండీ ఆదాయం లెక్కించనున్నట్టు ఆలయ కార్యానిర్వాహణాధికారి నరేందర్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సీసీ కెమెరాలు, పోలీసుల నిఘాలో దేవాలయశాఖ అధికారులు, సిబ్బంది, భక్తుల సమక్షంలో లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు విరాళాలు అందించాలంటే దేవాలయంలోని కార్యాలయంలో సంప్రదించి విరాళాలు అందజేసి కచ్చితంగా రశీదును పొందాలని ఆలయ ఈఓ తెలిపారు.



పూజలు చేస్తున్న జంపన

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత: జంపన

సికింద్రాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన పెంచడం వలన సమాజం ప్రశాంతంగా ఉంటుందని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. బోయినపల్లి సీతారాంపురంలోని వీరాంజనేయ శివపంచాయతన ఆదిత్య నవగ్రహ దేవాలయ స్వాగత తోరణం దేవతామూర్తుల స్థాపన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజలు జరిపారు. శ్రీధర్‌రెడ్డి, రాజేశ్వరరావు, పురుషోత్తం, సాయిబాబా యాదవ్, మనోహర్‌రావు, రాజేందర్, శంకర్‌గౌడ్, ప్రకాష్, సంగీత, నాగభూషణం, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



హైదరాబాద్ జిల్లా జట్టు

క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరచాలి

బోయినపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడల కోసం ఎంపికైన హైదరాబాద్ జిల్లా జట్టు బాలికల శిక్షణాశిబిరం గురువారం ముగిసింది. ఎంపికైన జిల్లా జట్టుకు బోయినపల్లిలోని సీఎంఆర్ హైస్కూల్‌లో పది రోజుల పాటు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో కోచ్ ప్రసాద్ పర్యవేక్షణలో శిక్షణను నిర్వహించారు. ఈ శిక్షణలో క్రీడాకారులకు మెళకువలు, కొత్త నిబంధనలపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమానికి సీఎంఆర్ డైరెక్టర్ ఎస్‌కె రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖోఖో జట్టు అత్యుత్తమ క్రీడా నైపుణ్యాన్ని కనబర్చి విజయంతో తిరిగి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ సభ్యులు పోచప్ప, కిషోర్, వ్యాయామ ఉపాధ్యాయులు దాస్, నరేషలు పాల్గొన్నారు.